క్లుప్తంగా

సంతలో అన్నదానం


భోజనాలు వడ్డిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

పాకాల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో నిర్వహిస్తున్న వారపు సంతలో సోమవారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సొంత నిధులతో ప్రజలకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే సతీమణి చెవిరెడ్డి లక్ష్మి రైతులు, చిన్న, సన్నకారు రైతులు, వ్యాపారులు, ప్రజలకు భోజనాలు వడ్డించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు అన్నం కోసం అవస్థలు పడకూదని ఎమ్మెల్యే ప్రతి సోమవారం భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం కుప్పంబాదూరు, చిట్టత్తూరు కాలేపల్లి, రాయలచెరువు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను పరిశీలించారు. ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీరాణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో మహ్మద్‌రఫీ, తహసీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

పాకాల: స్థానిక దినసరి కూరగాయల మార్కెట్ ఎదురుగా పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఎంపీడీవో ప్రభాకర్ సోమవారం పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రూ.50 లక్షలతో 16 గదులు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే పంచాయతీలో వ్యాపార నిమిత్తం గదులు కావలసిన వారికి అందజేస్తామని వివరించారు. సర్పంచ్ ఎస్.కస్తూరి, ఈవో మోతి పాల్గొన్నారు.

కొబ్బరి మొక్కల పంపిణీ


కొబ్బరి మొక్కలు అందజేస్తున్న నేతలు

పాకాల: పర్యావరణ పరిరక్షణలో భాగంగా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రతి ఇంటికీ రెండు కొబ్బరి మొక్కలు అందజేశారు. మండలంలోని మేజర్ పంచాయతీ పాకాలలో సోమవారం 3,066 కుటుంబాలకు 6,132 మొక్కలను ప్రజా ప్రతినిధుల ద్వారా పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, విరివిగా ఆక్సిజన్ దొరకాలన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే మొక్కలు సరఫరా చేశారని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.కస్తూరి, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, ఈఓ మోతి, నాయకులు చినబాబునాయుడు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత


నగదు అందజేస్తున్న మిత్రులు

తిరుపతి కల్చరల్: టీపీపీఎం హైస్కూల్లో చదువుకున్న 1991 బ్యాచ్‌కు చెందిన ముస్తాక్ ఆకస్మికంగా మృతి చెందాడు. ఆయన భార్య, పిల్లలు ఇబ్బందుల్లో ఉన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ముస్తాక్ బాల్య స్నేహితులు సోమవారం రూ.50 వేలు అందజేశారు. చిత్తరంజన్, పద్మావతిపురం సర్పంచ్ గణపతి నాయుడు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, టి.రామారావు, గంగమ్మ గుడి మాజీ చైర్మన్ చింతా భరిణియాదవ్, పాల్గొన్నారు.

క్రైస్తవులకు ఇచ్చిన హామీని నెరవేర్చిన సీఎం జగన్

తిరుపతి కల్చరల్: క్రైస్తవులకు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని ఏపీ బిషప్ కౌన్సిల్ రాష్ట్ర చైర్మన్ ఎలమంచిలి ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండవ విడతలో దరఖాస్తు చేసుకున్న పాస్టర్లకు వారి ఖాతాల్లో ఒకేసారి రూ.20 వేలు జమ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. నగదు బదిలీకి కృషి చేసిన మంత్రి మెరుగు నాగార్జునకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

2024 తర్వాత టీడీపీ, జనసేన కనుమరుగు

- జగనన్న సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- 9వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం


ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి మంగళం: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి చంద్రబాబు గుండెల్లో దడ పుడుతోందని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన సోమ వారం డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్ ఆదం లీలావతి, మాజీ సర్పంచ్ ఆదం సుధాకర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మహ్మద్‌ఖాసీమ్‌తో కలిసి 9వ డివిజన్ కొర్లగుంటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి వారికి జగనన్న అందించిన సంక్షేమ పథకాలు వివరించారు. వారు పొందిన లబ్ధిని తెలియజేశారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పేదప్రజల కోసం నాలుగేళ్లలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి చంద్రబాబు ఓర్వలేక విమర్శలు చేస్తున్నాడని మండిపడ్డారు. ఎన్ని చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, 2024 ఎన్నికల తర్వాత టీడీపీ, జనసేన కనుమరుగవుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు పాముల రమేష్‌రెడ్డి, దేవదానం, టౌన్ బ్యాంకు డైరెక్టర్లు వేమూరి జ్యోతిప్రకాష్, వెంకటేష్‌రాయల్, కంకణాల రమేష్, నాదముని, శ్యామల, పాండు రాయల్, రాజురాయల్, వసంతమ్మ, భారతి, అణు, రమణమ్మ పాల్గొన్నారు.

జగనన్న పెన్షనే నాకు ఆధారం



షుగర్ వ్యాధితో నాకు ఒక కాలు పూర్తిగా తీసేశారు. నడవలేని పరిస్థితి. నాకు జగనన్న అందిస్తున్న పెన్షనే ఆధారం. నా భార్య పద్మలతకు వలంటీర్ ఉద్యోగం కల్పించారు. ఆమెకు వచ్చే జీతంతోపాటు సంక్షేమ పథకాలు మా కుటుంబానికి ఎంతో దోహదపడుతున్నాయి. –వి.రమేష్, వికలాంగుడు

పథకాలు మా జీవితాలకు భరోసా



ముఖ్యమంత్రి జగనన్న ఇస్తున్న సంక్షేమ పథకాలు మా జీవితాలకు భరోసా అయ్యాయి. నా భర్త గంగాధర్ ప్రమాదవశాత్తు మృతి చెందారు. ప్రభుత్వం ఇచ్చిన రూ.2 లక్షల బీమా సొమ్ము నాకు ఆసరా అయ్యింది. పథకాల కింద రూ.8 లక్షల వరకు లబ్ధిపొందాను. –కుమారి, కొర్లగుంట

ఎస్వీఆర్ విగ్రహ ప్రతిష్టాపనకు చర్యలు

- ఎస్వీఆర్ విగ్రహ ప్రతిష్టాపన బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరంలో త్వరలో విశ్వ విఖ్యాత సినీ నటుడు ఎస్వీ రంగారావు విగ్రహ ప్రతిష్టాపన చేపట్టనున్నట్టు కమిటీ కన్వీనర్ రంగూన్ శంకర్ తెలిపారు. ఆయన సోమవారం ఎస్వీ రంగారావు విగ్రహ ప్రతిష్టాపన బ్రోచర్‌ను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎస్వీ రంగారావు విగ్రహ ప్రతిష్టాపనకు గతంలో సంపూర్ణ మద్దతు ఇచ్చిన మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే భూమన, టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నంది సర్కిల్‌తోపాటు మరో రెండు స్థలాలను పరిశీలించామని, అనుమతి కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే భూమన సంపూర్ణ మద్దతుతో త్వరలో విగ్రహ ప్రతిష్టాపన చేస్తామన్నారు. కార్యక్రమంలో శిల్పి స్వామి, కమిటీ సభ్యులు, తిరుపతి జిల్లా బలిజ సంఘం యువజన విభాగం అధ్యక్షుడు బండ్ల లక్ష్మీపతి, బడేటి శ్రీనివాసరావు, తిరుమల శెట్టి రవిశంకర్, బెల్లం కొండ సురేష్, డాక్టర్ కరుణానిధి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి
- సీసీ రోడ్ల ప్రారంభం


సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మేయర్, డిప్యూటీ మేయర్లు, కమిషనర్

తిరుపతి తుడా: తిరుపతి నగర ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయ్ రెడ్డితో 41వ డివిజన్ వరదరాజ నగర్‌లో రూ.40 లక్షలతో అభివృద్ధి చేసిన రెండు సీసీ రోడ్లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరం అభివృద్ధి కోసం రాజీలేని నిర్ణయాలు తీసుకుని అమలుచేస్తున్నామని వివరించారు. ఇందులో భాగంగా ఇంటర్నల్ రోడ్లను ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. మేయర్ శిరీష, కమిషనర్ హరిత మాట్లాడుతూ తిరుపతి ప్రజలకు సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి మాట్లాడుతూ పలు ప్రాజెక్టులతో రాబోవు రోజుల్లో తిరుపతిని మరింత అభివృద్ధి చేసేందుకు తగిన నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు. మరో ఆరు నెలల్లో తిరుపతి రూపురేఖలు మారుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ స్రవంతి, డివిజన్ అధ్యక్షుడు రాజేష్, మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ మోహన్, డీఈ గోమతి, విశ్వం విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షుల నియామకం


సుదర్శన్


రాఘవులునాయుడు


ఈశ్వర్‌రెడ్డి


లోకేశ్వరరెడ్డి


రమేష్



మార్కండేయులునాయుడు, సురేష్‌యాదవ్


చిరంజీవిరెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలంలోని పలు పంచాయతీలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షులను నియమిస్తూ ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎం.కొత్తపల్లికి మార్కండేయులునాయుడు, చిన్నరామాపురానికి ఏకాంబరం, నరసింగాపురానికి రాజేంద్రప్రసాద్‌రెడ్డి, తొండవాడకు సురేష్‌యాదవ్, అగరాలకు చిరంజీవిరెడ్డి, బి.కొంగరవారిపల్లికి శ్రీధర్‌నాయుడు, కల్‌రోడ్‌పల్లికి రమేష్, పిచ్చినాయుడుపల్లికి లోకేశ్వర్‌రెడ్డి, దొర్నకంబాలకు ఈశ్వర్‌రెడ్డి, బందార్లపల్లికి రాఘవులునాయుడు, శేషాపురానికి సుదర్శన్ నియమితులయ్యారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని వారికి ఎమ్మెల్యే సూచించారు.

సమాజ సేవలోనే ఆత్మ సంతృప్తి

- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- ఘనంగా ఎస్‌కే బాబు జన్మదిన వేడుకలు


రుయా వద్ద బిరియానీ పంపిణీ చేస్తున్న ఎస్‌కే.బాబు

తిరుపతి కల్చరల్: తన వారి కోసం శ్రమిస్తూ వారికి అండగా నిలిచిన సేవాతత్పరుడు కార్పొరేటర్, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే.బాబు అని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. ఎస్‌కే.బాబు జన్మదిన వేడుకలను సోమవారం బాబూ జగ్జీవన్ రామ్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేతోపాటు పలువురు వైఎస్సార్ సీపీ నేతలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజ సేవలోనే ఆత్మసంతృప్తి కలుగుతుందన్నారు. తన పాతికేళ్ల రాజకీయ జీవితంలో ఎల్లవేళలా వెన్నంటి నిలిచిన స్నేహశీలి అని పేర్కొన్నారు. ఎస్‌కే.బాబు మాట్లాడుతూ తనను సన్మార్గంలో నడిపి రాజకీయ ఎదుగుదలకు ఎమ్మెల్యే అందించిన సహకారం మరువలేనిదన్నారు. ఎస్‌కే బాబు జన్మదినం సందర్భంగా తిరుచానూరు రోడ్డులోని నవజీవన్ అనాథాశ్రమంలో పేదలకు అల్పాహారం, రుయాసుపత్రి వద్ద పేదలకు బిర్యాని, లక్ష్మీపురం సర్కిల్లో అన్నదానం, ఎంఆర్ పల్లి, ఎస్వీనగర్‌లోని మదర్సాలో విద్యార్థులకు బిర్యాని, కేటీ రోడ్డులోని పద్మావతి అనాథాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. డీఆర్ మహల్ సర్కిల్లో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన కోర్టు పరిపాలన అధికారి వెంకటనరసయ్య

తిరుపతి లీగల్: తిరుపతి నాలుగో అదనపు జిల్లా జడ్జి కోర్టు పరిపాలన అధికారిగా నియమితులైన వెంకటనరసయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కర్నూలు నాలుగో అదనపు జిల్లా జడ్జి కోర్టు పరిపాలన అధికారిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఆయన ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివిధ కోర్టుల్లో విధులు నిర్వహించారు. ఆయనను తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి, ఇతర సిబ్బంది అభినందించారు.

ఎంపీని కలిసిన రైల్వే డీఎస్పీ



తిరుపతి అర్బన్: తిరుపతి ఎంపీ గురుమూర్తిని సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సౌత్ వెస్ట్రన్ రైల్వే ఇంటలిజెన్స్ డీఎస్పీ ఎంఎస్ రాజు కలిశారు. తిరుమల శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఎంపీ ఆయనను శాలువాతో సత్కరించారు.

వృద్ధులకు ఉచిత వైద్య పరీక్షలు



తిరుపతి తుడా: స్థానిక పద్మావతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం అనురాగ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయుష్ వీజే హాస్పిటల్ అధినేత డాక్టర్ జ్యోతికుమార్ పర్యవేక్షణలో వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ జ్యోతి కుమార్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్కే బాబు, ఎల్లయ్య శెట్టి, మునస్వామి, మునీంద్ర నాయక్, ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ప్రతి అర్జీని పరిష్కరించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ శిరీష

చంద్రగిరి(తిరుపతి రూరల్): జగనన్న సురక్ష కింద దరఖాస్తు చేసుకుంటున్న ప్రతి అర్జీని పరిష్కరించి ప్రజలకు సర్టిఫికెట్లు అందజేయాలని చంద్రగిరి తహసీల్దార్ శిరీష ఆదేశించారు. ఆమె సోమవారం రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. భూ సమస్యలు, ఇంటి స్థలం సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న భూహక్కు– భూ రక్ష పథకం అమలవుతున్న గ్రామాల్లో సర్వేకు సహకరించాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్లు మోహన రెడ్డి, యుగంధర్, ఆర్ఐ సులోచనమ్మ, వీఆర్వోలు నాగరాజు, వాసు, వెంకన్ననాయుడు, విష్ణు పాల్గొన్నారు.

యువశక్తి వినియోగంతోనే దేశాభివృద్ధి


సదస్సులో పాల్గొన్న వీసీ భారతి

తిరుపతి ఎడ్యుకేషన్: యువశక్తి వినియోగంతోనే దేశం అభివృద్ధి పథంలో దూసుకెళుతుందని, ఆ దిశగా యూనివర్సిటీ వీసీలు సమర్థతతో ముందుకు సాగాలని పుదుచ్చేరి మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడి తెలిపారు. హర్యానా రాష్ట్రంలోని ఐఐఎంఎం గుర్గావ్‌లో జరుగుతున్న మొదటి జాతీయ మహిళా వీసీల సదస్సులో పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ డి.భారతి పాల్గొన్నారు. సోమవారం మహిళా నాయకత్వం–సమాజ నిర్మాణం అనే అంశంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా కిరణ్‌బేడీ మాట్లాడుతూ యూనివర్సిటీల్లో ఉండే యువశక్తిని దేశ అభివృద్ధి కోసం వినియోగించుకోవడం వీసీల నాయకత్వం సమర్థత ఆధారపడి ఉంటుందన్నారు. వీసీలు విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. ఈ మేరకు వీసీ భారతి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రతి విద్యుత్ లైట్ వెలగాల్సిందే

తిరుపతి తుడా: తిరుపతి నగరంలోని ప్రతి విద్యుత్ లైటూ వెలగాల్సిందేనని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత స్పష్టం చేశారు. ఆమె సోమవారం డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, అధికారులతో కలిసి స్పందన, డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాల్లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. స్పందనలో వచ్చే ప్రతి ఫిర్యాదుకూ పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మున్సిపల్ పార్కుల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని ఇంజినీర్లకు సూచించారు. అక్కడక్కడ విద్యుత్ బల్బులు వెలగడం లేదన్న ఫిర్యాదులు ఉన్నాయని, లైట్ల నిర్వహణపై దృష్టి సారించాలని ఆదేశించారు. మురుగు కాలువల్లో ప్రతిరోజూ వ్యర్థాలు తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, ఎస్ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, సెక్రటరీ రాధిక, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.